# ఆధునిక నీతి కథలు



## తాళ్లూరు నాగేశ్వరరావు

సెక్రెటరీగారి రూమ్‌ముందు మూడు గజాల మొండిబల్ల వుంది. సెక్రెటరీ గార్ని చూడటానికి ఎవరొచ్చినా ముందు ఆ బల్లమీద పదినిముషాలో, పావు గంటో తిష్ఠ వేయాల్సిందే! బయటి నుంచి వచ్చే విజిటర్లను ఎవ్వర్నీ లోపలకు పోనివ్వడు సెక్రెటరీగారి హెడ్ ప్యూన్ మల్లేశం. ఆ బల్ల పక్కనే అతను కూర్చుండే కుర్చీ. ఆ కుర్చీకి చేతుల్లేవు. అయినప్పటికీ మొండిబల్లకంటే ఆ కుర్చీకే హోదా ఎక్కువని మల్లేశం అనుకొంటూ వుంటాడు.

సెక్రెటరీగారు పదకొండుంబావుకు ఇంటి దగ్గర్నుంచి ఆఫీసు కొచ్చారు. పదకొండున్నరకల్లా ఆయన టేబుల్‌పైన కప్పూ సాసర్లో కాఫీ పెట్టాడు. వెను వెంటనే ఓ కింగ్ సైజు గోల్డ్‌ఫ్లేక్ సిగిరెట్ ప్యాకెట్ వుంచాడు. ఆ తర్వాత డోర్ దగ్గర బయట కుర్చీలో కూర్చున్నాడు మల్లేశం.

మరో రెండు నిమిషాల్లో సూట్‌లో ఓ విజిటర్ వచ్చి, బ్రీఫ్‌కేస్ నుంచి అందమైన అరు రంగుల్లోని విజిటింగ్ కార్డును మల్లేశానికిచ్చి, "లోపల అయ్యగారి కివ్వు" అన్నాడు. ఆ కార్డు తీసుకొని, ఆ సూట్ మనిషికేసి ఎగాదిగా చూశాడు మల్లేశం. కాని లోపల కెళ్ళలేదు.

"కొంచెం ఆ కార్డు లోపలకు పంపిస్తే, నేను అర్జంటుగా మరో చోటుకు వెళ్లాలి" అన్నాడు సూటులో వున్న మనిషి.

"అయ్యగారు డి. ఎస్ తో మాట్లాడుతున్నారు" అన్నాడు మల్లేశం బీడీ వెలిగించి.

"డి. ఎస్ అంటే?"

"డిప్యూటీ సెక్రటరీ" అన్నాడు మల్లేశం బీడీదమ్ము లాగుతూ.

ఆ సూటుమనిషి మొహంలో అసహనం ఉవ్వెత్తున లేచింది. ఏం చేయాలో తోచలేదు. పూజారికి దేవుని గుడిలో ఎంత ప్రాముఖ్య ముందో గ్రహించాడు. వెంటనే జేబులోంచి ఓ రూపాయినోటు తీసి, "ఛాయ్ తాగు" అని ఇచ్చాడు.

మల్లేశం ఆ రూపాయినోటును లాల్చీ పక్క జేబులో దోపుకొని, ఆ కార్డు పుచ్చుకొని లోపలకు వెళ్లాడు.

మల్లేశం బయటికొచ్చేసరికి ఇద్దరు విజిటర్లు ఆ బెంచీమీద కూర్చున్నారు. ఆ ఇద్దరూ తమ విజిటింగ్ కార్డులను మల్లేశానికిచ్చి, అతణ్ని పక్కకు పిల్చి చెరో రెండు రూపాయలు మామూలు సమర్పించుకొన్నారు. చిరునవ్వు నవ్వుతూ లోపలి కెళ్ళొచ్చాడు మల్లేశం.

మూడు నిముషాల తర్వాత బెల్ మోగింది.

ముగ్గురు విజిటర్లూ గబుక్కున లేచారు తమలో ఎవర్ని ముందుగా సెక్రెటరీ పిలుస్తాడో అన్న ఆదుర్దాతో.

మల్లేశం లోపలకు వెళ్లాడు.

ఓ నిముషం తర్వాత ఓ ఫైలుతో బయటి కొచ్చాడు.

అంతలో మరో విజిటర్ వచ్చాడు— ఖద్దరు లాల్చీతో, ధోవతితో, ఇండియన్ 'స్ప్రే' పరిమళం ఖద్దరు దుస్తుల్లోంచి గుప్పున కొడుతోంది. ఆయన్ను చూడగానే మల్లేశం సవినయంగా నమస్కారం చేశాడు. ఆ ఖద్దరు పెద్దమనిషి లాల్చీ జేబులోంచి అయిదు రూపాయల నోటు తీసి మల్లేశానికి అందించి, "నే నొచ్చినట్టు అయ్యగారితో చెప్పు" అన్నాడు. "అంతకంటేనా" అంటూ మల్లేశం లోపలకెళ్ళి, మరు నిముషంలో నే బయటి కొచ్చాడు.

అరగంట గడిచింది.

మరో ముగ్గురు విజిటర్లు బెంచీమీద కూర్చున్నారు. వాళ్లు మల్లేశానికి రూపాయికి తక్కువ లేకుండా మామూలు ముడుపు చెల్లించుకున్నారు. అందరూ సెక్రెటరీగారి పిలుపుకోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని నిరీక్షిస్తున్నారు. ఎవరికి వారు తమకే మునుముందుగా పిలుపు వస్తుందని అనుకొంటున్నారు.

మొండి కుర్చీలో కూర్చుని మల్లేశం మటుకు బీడీ మీద బీడీ కాలుస్తున్నాడు.

సెక్రెటరీగార్ని కల్సుకోవడానికి వచ్చిన విజిటర్లతో బెంచీ నిండి పోయింది. ఇద్దరు ముగ్గురు సిగిరెట్లు కాల్చుకుంటూ వరండాలో పచార్లు చేయసాగారు.

ఇంకో అరగంట గడిచింది.

లోపల సెక్రెటరీగారు అంతసేపు ఎవరితో మాట్లాడుతున్నారో, ఏం చర్చలు జరుపుతున్నారో, ఏం చేస్తున్నారో ఎవ్వరికీ తెలీదు ఒక్క మల్లేశానికి తప్ప.

లోపల్నుంచి బెల్ మోగింది.

విజిటర్లందరూ లేచి నిలబడ్డారు— ఎవరికి పిలుపు వచ్చిందోనని.

కాలుస్తున్న బీడీని చప్పున కిందపడేసి, చెప్పుకాలుతో రుద్ది, లోపల కెళ్లాడు మల్లేశం తలపాగా సవరించుకొంటూ.

రెండు నిముషాల తర్వాత బయటి కొచ్చాడు మల్లేశం.

"ఎవ్వర్ని రమ్మన్నారు లోపలికి?"

"నన్నా?"

"మల్లేశం! నా సంగతి చెప్పావా?"

"అయ్యగారికి నే నొచ్చినట్టు తెలిస్తే సెకండ్లమీద లోపలకు రమ్మనే వారే! నువ్వు చెప్పలేదా?"

— మొదలైన ప్రశ్నలతో విజిటర్లంతా మల్లేశం చుట్టూ మూగారు కందిరీగల్లాగా.

వర్షించని మేఘంలా నవ్వాడు మల్లేశం.

"మినిస్టరుగారు అర్జంటుగా పిలిస్తే అయ్యగారు ఆగమేగాలమీద వెళ్లారు. ఎప్పుడొస్తారో ఏమిటో! మీరంతా రేపు రావడం మంచిది" అన్నాడు మల్లేశం మరో బీడీని వెలిగిస్తూ.

అందరూ ఒకళ్ళ మొహా లొకళ్లు చూసుకొని, నిరాశా నిస్పృహల నిట్టూర్పుల్ని విడిచి, ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

ఆ రోజు వచ్చిన మామూళ్ళను తాపీగా లెక్కించుకున్నాడు హెడ్ ప్యూన్ మల్లేశం.

ఉద్యోగుల్లో లంచగొండితనాన్ని సమూలంగా నిర్మూలించడానికి మినిస్టరుగారు ఆ సెక్రెటరీతో సుదీర్ఘంగా చర్చలు జరిపి, కొన్ని పరిష్కార మార్గాలను ఆ సాయంత్రం ప్రకటించారు. కాని వాటిల్లో ప్యూన్లకు వచ్చే మామూళ్ళను గురించి ఏమీ లేకపోవడాన్ని చూసి మల్లేశం మహా సంతోషించాడు.

*అవినీతి సముద్రానికి పెద్దకాలువలెన్నో, పిల్లకాలువలు అంతకు పదింతలు. అయితే అందరి దృష్టీ పెద్దకాలువలపైనే ఉంటుంది.*